# దర్గామిట్ట కతలు

## బులుగంటే బులుగా పలావెంకారెడ్డా!

యివ్వడంటే కావలి కోర్టెదురుగ్గా పలావు సెంటరు పెట్టి ప్లేటుకు యిరవై ఆరు రూపాయిలు కళ్ల జూస్తున్నాడుగానీ మేం పిలకాయలుగా వున్నవ్వుడు పలావెంకారెడ్డి కూడా బాగా యిబ్బందులు పడినోడే!

పలావెంకారెడ్డి (పలావు+ వెంకారెడ్డి) మా నాయినకు ప్రాణ స్నేహితుడు. అంతేగాదు. మా నాయిన పెళ్లికి పెళ్లి పెద్ద కూడా.

మా అమ్మను మా నాయినకిచ్చి చేయాలని మా అమ్మనాయిన మస్తాన్‌సాయిబు నిచ్చయించుకున్నాక మా నాయిన 'కాండక్టు'ను వస్తువస్తు పలావెంకారెడ్డినే అడిగినాడంట.

'పిల్లోడు బంగారం. కళ్లు మూసుకొనిచ్చేయ్ మస్తాన్ సాయిబూ' అని, పలావెంకారెడ్డి భరోసా యిచ్చినాకే మా అమ్మ నాయిన స్థిమిత పడినాడంట.

పలావెంకారెడ్డి మా నాయిన కంటే ఏడెనిమిదేళ్ల పెద్దోడు. అయినా కసరత్తు చేసిన కండలతో (ఆయన పహిల్వాను), మంచి వొంటి చాయతో, తలకు రంగేసుకొని, తెల్లటి గుడ్డలు కట్టుకొని కుర్రపిల్లోడాల కనిపించేవాడు.

పెళ్ళినాటికి మా అమ్మ పద్నాలుగేళ్ల చిన్నపిల్ల గాబట్టి ఆయన మా అమ్మని 'అమ్మాయ్' అని పిలిచేవాడంట. ఆ తర్వాత్తర్వాత ఆయనకి ఆ పిలుపే అలవాటయిపోయింది.

మా నాయిన మీద ఏమోగానీ ఆయనకు మా అమ్మంటే బాగా అబిమానం.

సంక్రాంతి వచ్చిందంటే చాలు మా అమ్మకు యిష్టమని చెప్పి పెద్ద స్టీలు టిపిను నిండుగా అరిసెలు, మనుబూలు, లడ్లు తీసకొచ్చి 'తీసుకో అమాయా' అంటా యిచ్చేవాడు. అవేక మా నాయిన్నీ అన్ననీ వన్నూ యింటికి పిలచకెళ్లి, యిస్తరాకు నిండుగా పాయినం బోసి పండగ బోజనం పెట్టేవాడు. (ఇక్కణ్ణే యింకో సత్యంకూడా చెప్పకోవాల. మా అమ్మ ఏ శుబకార్యానికి వెళ్ళాలన్నా నిన్న మొన్నటి దాకా కూడా పలావెంకారెడ్డి బార్యనగో, ఆయన కోడలి నగో హక్కుగా తెచ్చుకునేది)

మేం పిలకాయలుగా వున్నప్పుడు పలావెంకారెడ్డికి యవసాయం వుండేదో లేదో నాకు తెలియదుగానీ యింట్లో మాత్రం ఎవ్వడూ బరెగొడ్లుండేవి. ఆయన బార్య తెల్లారి లేచి బరెగొడ్డాల కష్టపడతా వుండేది.

యీ కష్టాన్ని రొంతయినా దూరం చేయాలని పలావెంకారెడ్డి రకరకాల పనులు చేశాడంట. సత్తెకాలవుమనిషి కాబట్టి డబ్బులు సంపాదించడం ఆయనకి చేతకాలా. (చివరకి పలావు సెంటరు పెట్టినాకగాని ఆయన దశ తిరగలా. అదెప్పడైతే పెట్టినాడో అప్పణ్ణుంచి మా వూర్లో ఆయన పేరు రేవాల వెంకారెడ్డికి బదులు పలావెంకారెడ్డిగా మారిపోయింది)

అట్టాంటి చేతగాని పనుల్లో ఒంగోలు బస్టాండు కాడ గుడ్డల షాపు తెరవడం ఒకటి. అది పెద్దగా నడిచేది కాదుగానీ పలావెంకారెడ్డి, ఆయన పెద్ద కొడుకు మాత్రం టంచనుగా అందులో బేరానికి కూచోనుండేవాళ్లు!

పలావెంకారెడ్డి గురించి యింత కత ఎందుకు చెప్పినావంటే రంజాను నెల వచ్చినాక ఆయన్తో మాకు పనిబడింది. అది కూడా మా అమ్మ పోరు వల్ల.

'యీదిలోని ఆడోళ్లంతా గాదంశెట్టి సుబ్బారావు కొట్టుకాడికెళ్లి కోరిన గుడ్డలు తెచ్చుకుంటుండారు. నాగ్గూడా రెండొందలో మూడొందలో యీరాదా? పిలకాయలకు గుడ్డలు తెస్తా' అని, రంజాను నెల మొదులైన కాణ్ణుంచి మా అమ్మ మా నాయిన




ప్రాణం తీస్తా వుంది.

ఆయినేమో ఉలకడూ. పలకడూ.

'యాణ్ణుంచి మాక్కొచ్చేది మే' అని తగులాడేవాడు ఒకోసారి.

నాలుగు దినాలు పోనిచ్చి, మా అమ్మ న్యాగ్గా మా నాయినమ్మను ఉసిగొలిపింది మా నాయిన మీదకు.

'రే అబయా. ఏందిరా నువ్వా నీ బేఢంగీ పనులూ? మనకు లాకపోయినా పిలకాయలకయినా నాలుగు గుడ్డముక్కలు తేకపోతే ఎట్టా? యీదిలోని పిలకాయలను చూసి వాళ్లు చిన్నబుచ్చుకోరా?' అందామె.

మా నాయిన ఏమనుకున్నాడో ఏమోగానీ 'సాయింత్రం పెద్దోణ్ణీ, రెండోవాణ్ణీ కొట్టుకాడికి పంపండి. డబ్బులు దొరికితే చూద్దాం' అని చెప్పేసిపోయినాడు.

సాయింత్రానికి మా అమ్మ మా అన్ననూ నన్నేగాకుండా మా చెల్లెల్ని కూడా రెడీచేసి రైల్వేరోడ్డులోని మా కొట్టుకాడికి పంపించింది. ( మా చెల్లెలి మొకం చూసయినా ఆయన గుడ్డలిప్పిస్తాడేమోనని మా అమ్మ ఆశ).

కానీ మా నాయిన ఎట్టాంటోడా?

మేం పోయేసరికి చేతులు నెత్తినబెట్టుకొని నప్పంగా కూచోనున్నాడు.

మమ్మల్ని చూడ్డంతోటే 'ఇయ్యాల కాదులే. ఇంటికి పొండి' అన్నాడు, మా చెల్లెల్ని ఎత్తుకొని కొట్టుకు తాళం ఏయబోతా.

మేమంత పునూరుమన్నాం.

మా అన్నకయితే ఏడుపొక్కటే తక్కువ.

సరిగ్గా అప్పడే దేవుడిలా వచ్చాడు పలావెంకారెడ్డి.

మమ్మల్ని చూసి 'ఏందయ్యో... చిన్న నవాబులంతా కలిసొచ్చినారో' అన్నాడు నవ్వతా.

మా నాయిన నవ్వలా. సంగతి చెప్పినాడు.

'దానికే ఏలాడబడిపోవాల్నా కరీం సాయిబా? నా కొట్టులా? అడిగితే నేసీనా? పొండి' అన్నాడు.

'నా దెగ్గిర డబ్బుల్లేవు సామీ. మళ్లా చెల్లించుకోలేను' అన్నాడు మా నాయిన, వద్దన్నట్టు.

'అయ్యో కాలే మాటలంటే. యిప్పుడు నేనడిగినానా డబ్బులు? నీ బిడ్డలకు పండగ తోఫా అనుకుంటాలే పా' అన్నాడాయన.

అందరం కలిసి ఒంగోలు బస్టాండుకాడున్న పలావెంకారెడ్డి గుడ్డల కొట్టుకెళ్లాం.

'కరీం సాయిబా! ఎట్టా మళ్ల తీయబోయేది లేదు గాబట్టి తీసేదేదో దిట్టంగా తీసీ. నాలుగురోజులు పడుంటాయి కదా' అన్నాడు పలావెంకారెడ్డి. అనడమే కాదు, కొయ్య అల్మారాల్లో పేర్చి వున్న గుడ్డల తానుల్లో నుంచి దిట్టంగా కనిపిస్తున్న ఒక బులుగురంగు తాను లాగి బయటపడేసినాడు.

'గ్యారంటీ గుడ్డ. చిరిగే కొసివే లా' అన్నాడు.

మా నాయినకు ఏమున్నా లాకపోయినా 'గ్యారంటీ' అనే మాట యినబడితే చాలు, అదే కావాలంటాడు.

'యింకేమి ఆలస్యం? కోసి పార్నాకు' అన్నాడు, పలావెంకారెడ్డితో.

ఎప్పుట్నే ఆయన ఆ తాను కోయడమైతే ఏమి, కొట్టు దిమ్మె మీదున్న దర్జీకి మేమంతా కొలతలు యియ్యడమైతే ఏమి ( మావూర్లో ప్రతి గుడ్డల అంగడి దిమ్మె మీదా మిషను బెట్టుకున్న దర్జీ ఉంటాడు), గుడ్డను తీసకెళ్లి ఆ దర్జీ ఇనప బక్కెట్టులో నానబెట్టడమైతే ఏమీ అంతా అయిదు నిమిషాల్లో జరిగిపోయింది.

(మిగతా పక్కపేజీలో)

(దర్జామిట్ట కత తరువాయి)

'రేపు రండి భాయ్! కుట్టేసి పెడతాను' అన్నాడు దర్జీ.

ఎట్టా గుడ్డ మిగిలిందిగదా అని, మా నాయిన మా తమ్ముడికి కూడా ఉరామారిగా కొలతలు చెప్పి కుట్టెయ్యమన్నాడు.

ఆ రోజు రాత్రి ఏదో గనకార్యం చేసినట్టు 'నలగరి గుడ్డలూ కొలతలకిచ్చేశాను మే' అని మా అమ్మతో గొప్పలు చెప్పకున్నాడు.

ఆ సంగతికి మొకం చేటంత చేసుకొని, తనకే కొత్త చీర తెచ్చినట్టుగా సంబర పడిపోయింది మా అమ్మ.

మరుసటి రోజు సాయింత్రం కుట్టిన గుడ్డలు తెస్తా వుంటే మా నాయినకు తోడుగా పలావెంకారెడ్డి కూడా మా యింటికి వచ్చినాడు.

మా అమ్మ గబగబా వచ్చి, న్యూసు పేపరులో కట్టిన గుడ్డల్ని తెరిచి చూసి, ఒక క్షణం తర్వాత గమ్మున లోపలికెళ్లిపోయింది.

మా నాయినమ్మ మాత్రం మురిసిపోతా, మమ్మల్నందర్నీ పిలిచి వాటిని 'ట్రయలుకు' తొడిగింది.

అవి తొడుక్కున్నాక మా అన్నా నేనూ మా చెల్లెలూ మా తమ్ముడూ పై నుంచి కిందదాకా ఫుల్లుగా బులుగంటే బులుగు!

మమ్మల్నా గుడ్డల్లో చూసి పలావెంకారెడ్డి తృప్తిగా తల వూపినాడు.

'బాకు కుట్టాడయ్యా మా టైలరు' అన్నాడు, మా నాయినతో.

'సరే పా. పోదాం' అన్నాడు మా నాయిన.

పలావెంకారెడ్డి లేచినాడు.

మా నాయిన బయిటికొచ్చి సైకిల్ తీయబోతా వుంటే 'అనో... మాట' అంటా పలావెంకారెడ్డిని ఆపేసింది మా అమ్మ.

సైకిల్ పట్టుకొని మా నాయిన, ఆయన్ని చిల్లర డబ్బులు అడగతా నేనూ బయిట్నే నిలబడిపోయాం.


కాసేపటికి పలావెంకారెడ్డి తత్తరబిత్తరగా బయిటికొచ్చాడు.

'య్యో! కరీం సాయిబా! అడిగినోడికి నీకూ బుద్దిలా. యిచ్చినోడికి నాకూ బుద్దిలా. నలగరికీ నాలుగు రకాల తాన్లు కోసిచ్చుంటే పొయ్యుండేది కదా... యిప్పుడు చూడు నీ బార్య- యిస్తే యిచ్చినావుగాని ఎంకారెడ్డన్నా మరీ అన్యాలంగా పైనుంచి కిందిదాకా బులుగంటే బులుగా అని అడగతా వుంది' అన్నాడు నవ్వతా.

మా నాయిన నోరెళ్ల బెట్టినాడు.

"అంతేకాదయ్యో! 'యీ మాదిరిగా దిట్టమైన గుడ్డలే అమ్ముకుంటా, యాపారంలో మాయ ఎరక్కుండా, అడగనోడిక్కి కూడా అప్పలిచ్చుకుంటా పోతే నువు కూడా ఆ మనిషిలాగా దేనికి పనికి రాబోతావు సామీ! యికనైనా నాలుగు డబ్బులు సంపాదించుకోవడం నేర్చుకో తంద్రీ' అని బుద్దులు చెప్పిందయ్యా ఆ బంగారు" అన్నాడాయన బక్తిగా.

–మహమ్మద్ ఖదీర్‌బాబు



## మీ కోపతాపాలు ఇంట్లో కాదు ఇక్కడ చూపండి.

## కోపిష్టి పేజీ

కోపం ఒక్కోసారి కొంప కూలుస్తుంటుంది. చిరుకోపమైతే ఫర్వాలేదు గానీ పిచ్చికోపం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది.

ఉదాహరణకి కూరలో ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా భర్తగారికి కోపమొచ్చి తినే పళ్ళెన్ని విసిరి కొడతాడు. అది కాస్త మూడో తరగతి చదివే అమ్మాయి మూతిమీద పడి పచ్చడవుతుంది. దీంతో భార్యకి పిచ్చికోపమొస్తుంది. మొగుణ్ణేం చేయలేక ఎల్‌కేజి చదివే పిల్లాడి వీపును బాదుతుంది. ఓ పక్క అమ్మాయి ఏడుపు. దీనికితోడు అబ్బాయి గగ్గోలు. వాడు ఏడుస్తూనే ఖోపంగా 'వుండండి మీ పని చెప్తా' నని అందాక రాసుకుంటూ రాసుకుంటూ వున్న బలపమ్ముక్కని కాస్తా ముక్కులో దోపుకుంటాడు.

ఇంక ఏముందీ? కొడుకునీ, కూతుర్నీ చెరోచంక వేసుకుని అక్కడా ఇక్కడా ఇల్లంతా గాలించినా వంద రూపాయలు దొరక్కపోయేసరికి పామునోట్లో వేలు పెట్టి 3,00 రూపాయలు అప్పుచేసి డాక్టరు దగ్గరకు వెళ్ళి కోపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం..

అయినా బుద్ధిరాదు కదా., ఇది జరిగి వారంకాకమునుపే మళ్ళా ఏదో ఒక కోపం.. మళ్ళా ఏదో ఒక అనర్థం..

ఆరోజుకి కోపం చిరాకు తెచ్చినా సంవత్సరం తర్వాత తలుచుకుంటే అవన్నీ సరదాగానే, భయంకరమైన పీడకలగానో గుర్తొస్తాయి.

**అలా మీ ఇంట్లో జరిగిన కోపతాపాలూ, వాటి పర్యవసానాలూ వ్రాసి ఈ కూపన్ కత్తిరించి కవర్ మీద అంటించి మరీ పంపండి. 'కోపిష్టిపేజీ' లో ప్రచురిస్తాము.**

చిరునామా: **'కోపిష్టిపేజీ'**
ఎడిటర్, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
రోడ్డునెం. 8, బంజారాహిల్స్, హైదరాబాద్–34.